జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 2-2-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 580 పేజీలు: 4 వెల: రూ.7

# లంచావతారులపై.. ఏసీబీ కన్ను!



* జిల్లాలో వరుసగా ఏసీబీ దాడులతో హడలెత్తిపోతున్న అధికారులు, ఉద్యోగులు
* ఎప్పుడు ఎవరి మీద దాడులు చేస్తారోనని భయం
* నీడను కూడా నమ్మని కొందరు అధికారులు
* మధ్యవర్తులను కార్యాలయాలకు అనుమతించని వైనం





**శ్రీకాకుళం, ఫిబ్రవరి 1 (వార్త):** జిల్లాలోని పలు శాఖల్లో అవినీతి పాతుకుపోయింది. ఏ పని కావాలన్నా.. ఒక రేటు ఫిక్స్. ఆ సొమ్ము ఇచ్చుకోకుంటే రోజులు, నెలల తరబడి పనులు పెండింగ్. దీంతో కార్యాలయాల చుట్టూ తిరగలేక, వారు చెప్పిన విధంగా కాగితాలు ఇవ్వలేక.. వారు చెప్పిన విధంగా సొమ్ములు ఇచ్చి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఉంది. అన్ని శాఖల్లోనూ ఇదే పంథా ఉంది. ఈ దందా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల్లో మరింత ఎక్కువగా ఉంది.. ఇది కాదనలేని నిజం. అందరికీ తెలిసిందే. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంతో పాటు ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు, మంత్రుల క్యాంపు కార్యాలయాల్లో నిర్వహించే స్పందనలోనూ ఎక్కువగా ఫిర్యాదులు భూ సమస్యలకు సంబంధించినవే వస్తున్నాయి. ప్రస్తుతం రీసర్వే కూడా జరుగుతోంది. సర్వే చేయాలంటే ఎంతోకొంత ముట్టజెప్పనిదే.. వారు రారు అన్న నానుడి ప్రజల్లో బాగానే ఉంది. ఇక వన్‌బీ, అడంగల్‌లో మార్పులు చేర్పులు చేయాలంటే చేయి తడపాల్సిందే. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అయితే మరీ చెప్పనక్కర్లేదు. ఆ శాఖ అధికారులు బహిరంగంగా రూపాయి తీసుకోకపోయినప్పటికీ.. దస్తావేజు లేఖరుల ద్వారా అంతా చేయిస్తుంటారు. రిజిస్ట్రేషన్ బట్టి వారికి ఈ దస్తావేజు లేఖరులు సాయంత్రం అయితే కార్యాలయంలో ఎవరెవరికి ఎంతెంత ఇవ్వాలన్న దానిపై ఠంచనుగా తెచ్చి ఇస్తుంటారు. ప్రస్తుతం గ్రామాలు, పట్టణాల్లో సీసీ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఉపాధి హామీ తదితర పథకాల కింద నిధులు వీటికి మంజూరు చేస్తారు. మార్చి నెలలోగా కాంట్రాక్టర్లు బిల్లులు పెట్టాలి. లేకుంటే నిధులు మురిగిపోయే అవకాశం ఉంది. దీంతో కాంట్రాక్టర్లు ఈ పనులను చకచకా చేస్తున్నారు. పలుచోట్ల రోడ్డు నిర్మాణం పూర్తికాకుండానే బిల్లులు పెట్టేస్తున్నారు. ఆబిల్లులు పాస్ చేయాలంటే సంబంధిత శాఖకు కమీషన్లు చెల్లించాల్సిందే. కాంట్రాక్టర్లకు బిల్లులు రానప్పటికీ కమీషన్లు మాత్రం ముందే చెల్లిస్తున్నారు. ఇలా అన్ని శాఖల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. శ్రీకాకుళం నగరంలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఎస్టీవో, సీనియర్ అకౌంటెంట్ రూ.15వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసిన సంఘటన తెలిసిందే. ఇక శ్రీకాకుళం జిల్లా సహాయ బీసీ బాలుర సంక్షేమ వసతి గృహ అధికారి (ఏబీసీడబ్ల్యూవో) జి.బాలముకుందరావు వార్డెన్ల నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ రెండు ఘటనలతో లంచావతారులు హడలిపోయారు. ఏసీబీ అధికారులు.. లంచావతారులపై కన్నేసినట్టు సమాచారం. ఆయా శాఖల వారీగా దృష్టి పెట్టినట్టు తెలిసింది. కొందరు అధికారులు, సిబ్బంది ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్టు వారి వద్ద సమాచారం ఉన్నట్టు గుసగుసలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో వరుసగా ఏసీబీ అధికారులు వల వేసి లంచావతారులను పట్టుకున్నారు.

## లంచం అడిగితే.. 9440440057కు ఫోన్ చేయండి

ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే మా దృష్టికి తీసుకురావాలని ఏసీబీ అధికారులు సూచిస్తున్నారు. అయినప్పటికీ కొందరు తమ పనులు వేగంగా అయిపోయివాలన్న ఉద్దేశంతో అధికారులు అడిగింది ఇచ్చేస్తూ పని చేయించుకుంటున్నారు. పని చేస్తున్నందుకు గాను ప్రభుత్వం వారికి నెలవారీ జీతం ఇస్తోంది. అయినప్పటికీ కొందరు చేతివాటం మానుకోవడం లేదు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 14400 టోల్ ఫ్రీ నెంబర్‌కు కానీ, 9440440057కు గానీ ఫిర్యాదు చేసి ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వవచ్చు. ప్రతి ప్రభుత్వ శాఖ కార్యాలయంలోనూ పోస్టర్లు ఉన్నాయి. అలాగే గోడలపై ప్రకటనలు కూడా ఉన్నాయి. ఏసీబీ అధికారులు సైతం ఎవరైనా లంచం అడిగితే తమను సంప్రదించాలని పదేపదే కోరుతున్నారు.

# రథసప్తమి వేడుకల.. ఖర్చెంత?



* కోటి వరకూ ఆదాయం వచ్చినట్టు లెక్క తేల్చిన దేవస్థానం అధికారులు
* వేడుకలకు ఎంత ఖర్చయిందన్న దానిపై స్పష్టత ఇవ్వని జిల్లా యంత్రాంగం
* మ్యూజిక్ ఈవెంట్లకే భారీగా ఖర్చు చేశారన్న విమర్శలు
* దొంగ పాసులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లకు ప్రాధాన్యంపై రాష్ట్రవ్యాప్తంగా లొల్లి
* అప్రదిష్టను మూటగట్టుకున్న జిల్లా యంత్రాంగం



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 1 (వార్త):** అరసవల్లి రథసప్తమి వేడుకలను పండగలా నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలను దేవదాయ శాఖ అధికారులతో పాటు జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహించింది. సుమారు రెండు లక్షల మంది రథసప్తమి రోజున సూర్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. అరసవల్లి జనసంద్రంగా మారింది. పోలీసు శాఖ ఎంత పకడ్బందీగా చర్యలు చేపట్టినా ప్రతి ఏడాది మాదిరిగానే తోపులాటలు కామన్. అయితే రాష్ట్ర పండగగా ప్రకటించడంతో జిల్లా యంత్రాంగం అతి చేసిందన్న విమర్శలు ఉన్నాయి. మ్యూజిక్ ఈవెంట్లకు పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేసింది. ఈ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్లు విడుదల చేస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రకటించారు. ఆ నిధులు వచ్చాయో లేదో తెలియదు. ఈ వేడుకలకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందన్నది బహిరంగ రహస్యమే. జిల్లా యంత్రాంగం సైతం ఇప్పటి వరకూ ప్రకటించలేదు. ప్రకటించే అవకాశం కూడా లేదు అని కొందరు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఈ వేడుకల తీరుపై కొందరు టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు సైతం బహిరంగ విమర్శలు చేశారు. ఇది ప్రభుత్వ పండగ అయినప్పటికీ కుటుంబ పండగలా మార్చేశారని మీడియా ముందు ప్రకటించారు. దొంగ పాసులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లకు ప్రాధాన్యంపై రాష్ట్రవ్యాప్తంగా లొల్లి జరిగింది. ఈసారి జిల్లా అధికారులు.. మీడియాకు ఎక్కడా ప్రాధాన్యత ఇవ్వకుండా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లకు ప్రాధాన్యత ఇచ్చారు. దీని పర్యవసానం ఏంటో వేడుకల అనంతరం జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిసివచ్చింది. ఏకంగా కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లు కొన్ని జెరాక్స్ సెంటర్ల నిర్వాహకులతో కుమ్మక్కై ఏకంగా నకిలీ వీఐపీ పాసులను ప్రింట్ చేశారని, వాటిని అమ్ముకున్నారని గ్యాసిప్‌లు వచ్చాయి. దీంతో వారు సైతం పోలీసుల విచారణను ఎదుర్కోనాల్సివచ్చింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్ల తీరుతో జిల్లా అధికారులు, అధికార పార్టీ నేతలు తలలు పట్టుకోవాల్సివచ్చింది. ఇక సామాన్య భక్తుల క్యూలైన్ల కంటే వీవీఐపీ, వీఐపీ, రూ.100, రూ.300, రూ.500, డోనర్ పాసులు ఉన్న క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆన్‌లైన్, ఆఫ్ లైన్ టిక్కెట్ల ద్వారా రూ.69,21,800, వీఐపీ టిక్కెట్ల ద్వారా రూ.24,84,600, లడ్డూ, పులిహోర ప్రసాదం టిక్కెట్లు ద్వారా రూ.11,55,040, కేశఖండన ద్వారా రూ.48,280, మొత్తంగా రూ.1,06,09,720 ఆదాయం వచ్చినట్టు అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఈవో ఇటీవల ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే వీఐపీల క్యూలైన్లు ఫుల్ అయినప్పటికీ ఆదాయం అనుకున్నంత రాకపోవడం పట్ల దేవస్థానం అధికారులు కూడా కక్కలేక, మింగలేక అన్నట్టు మౌనం వహించారు. ఏదేమైనా ఈసారి రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించినప్పటికీ జిల్లా యంత్రాంగానికి అప్రతిష్టపాల్జేసిందని అధికారులే చెప్పుకోవడం గమనార్హం.



జలుమూరు వాసికి
## టీటీడీ ఈవో బాధ్యతలు

* ముద్దాడ రవిచంద్రను నియమించిన రాష్ట్ర ప్రభుత్వం

**జలుమురు, ఫిబ్రవరి 1 (వార్త):** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవోగా అనిల్ కుమార్ సింఘాల్‌ను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేయగా, ఆయన స్థానంలో నరసన్నపేట నియోజకవర్గం జలుమూరు మండలం సవిరిగం గ్రామానికి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్రకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సింఘాల్‌ను వెంటనే సాధారణ పరిపాలనా విభాగం (జీఏడీ)లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్యకార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించడం నరసన్నపేట ప్రాంతానికి గర్వకారణంగా మారింది. సిట్ సిఫార్సుల మేరకు ఈ బదిలీ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. నరసన్నపేటకు చెందిన అధికారి రాష్ట్రంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన ధార్మిక సంస్థ నిర్వహణ బాధ్యతలు చేపట్టడం పట్ల స్థానికులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పరిపాలనా అనుభవం కలిగిన రవిచంద్ర నేతృత్వంలో టీటీడీ పాలన మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ నియామకం ద్వారా నరసన్నపేట పేరు రాష్ట్రస్థాయిలో మరోసారి ప్రముఖంగా వినిపించింది.

## శంకరరావు కుటుంబానికి పరామర్శ

**మందస, ఫిబ్రవరి 1(వార్త):** మందస మండలంలోని కుల్లోగాం గ్రామానికి చెందిన సవర శంకరరావు మృతి చాలా బాధాకరమని ఆదివాసీ వికాస పరిషత్ అధ్యక్షుడు సవర జగన్ అన్నారు. ఈ మేరకు శంకరరావు ఇంటికి వెళ్లి నాయకులు పరామర్శించారు. ఆదివాసీ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనే శంకర్ పాల్గొనే వాడని, ఆయన మరణం ఇటు ఆదివాసీ ప్రజలకు అటు వారి కుటుంబానికి తీరని లోటు అన్నారు. శంకరరావు కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. ఆదివాసీ వికాస పరిషత్ సంఘం రూ.5వేలతో పాటు అలాగే ఫోన్ పేల ద్వారా వచ్చిన రూ.10,700లు కలిపి మొత్తం రూ.15,700లను శంకర్ భార్య శాంతి అందిజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ వికాస పరిషత్ గౌరవ అధ్యక్షుడు గణేశ్వరరావు, సలహాదారుడు సీతారాం, కోశాధికారి విజయ్, సభ్యులు రాజు, సోమేశ్, శివ పాల్గొన్నారు.



## ప్రజల ఆరోగ్య పరిరక్షణే..

# కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

*** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * 11 మంది లబ్ధిదారులకు రూ.10,63,450 సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

**కోటబొమ్మాళి, ఫిబ్రవరి1 (వార్త):** నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 11 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 10,63,450 విలువైన చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరంలాంటిదని అన్నారు. గత ప్రభుత్వం పేదల ఆరోగ్య విషయంలో తీవ్ర నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, వారి సంక్షేమం, ఆరోగ్యంపై పూర్తి భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స అందించేందుకు అవసరమైనంత నిధులు ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. పేద ప్రజల వైద్యం కోసం ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హత ఆధారంగానే సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామని వివరించారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అనేక నిరుపేద కుటుంబాల్లో ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. వైద్య ఖర్చులు భారమై ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న వారి జీవితాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి వెలుగులు నింపుతుందని తెలిపారు. రాష్ట్రంలో వైద్య విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కింజరాపు హరివర ప్రసాద్‌తో పాటు నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.





## నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

**ఆమదాలవలస, ఫిబ్రవరి 1 (వార్త):** అమదాలవలస నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల్లో ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలకు వైద్య ఖర్చులు నిమిత్తం, చికిత్స పొందుతూ చనిపోయిన వారి కుటుంబాలకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులను పంపిణీ చేస్తున్నారు. ఈ చెక్కులను పొందూరు మాజీ ఎంపీపీ కూన ప్రమీలా ఆదివారం పలువురు లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి చికిత్స పొందిన వారికి పరామర్శించారు. వంజంగికి చెందిన మెండ రమణరావుకు రూ.88వేలు, పైడి భవానీకి రూ.47వేలు, కొత్తవలసకు చెందిన కొమనగిరి మనోజ్‌కు రూ.52వేలు, గురుగుబెల్లి అన్నపూర్ణమ్మకు రూ.1,36,000, ధర్మపురంనకు చెందిన చౌదరి వరలక్ష్మికి రూ.36వేలు, రామదాసుపురంనకు చెందిన గురుగుబెల్లి శ్రీనివాస్‌కు రూ.1,18,000లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

*** పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష * మందస మండలంలో పర్యటించి, పరామర్శలు**



**మందస, ఫిబ్రవరి 1(వార్త):** కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష అన్నారు. మందస మండలంలో ఇటీవల మరణించిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాలంటే కేవలం ఓట్లు, పదవులు కాదని, తమను నమ్ముకున్న ప్రజలు, కార్యకర్తల కుటుంబాల బాగోగులు చూడటమే నిజమైన నాయకత్వమన్నారు. కష్టకాలంలో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు నేనున్నానంటూ భరోసా కల్పించేందుకు విస్తృతంగా పర్యటించినట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముకని, వారి కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా అది నా కుటుంబానికి వచ్చినట్టే భావిస్తానన్నారు. అధికారం ఉన్నా లేకపోయినా, ప్రతీ కార్యకర్త కుటుంబానికి అండగా నిలవడం నా బాధ్యతన్నారు. ఎమ్మెల్యే శిరీష నేరుగా తమ ఇళ్లకు వచ్చి, తమ బాధను పంచుకోవడం పట్ల బాధిత కుటుంబాలు కన్నీటిపర్యంతమయ్యాయి. పార్టీ కోసం పనిచేసిన తమ వారిని, వారి మరణానంతరం కూడా నాయకత్వం గుర్తుంచుకోవడం తమకు కొండంత ధైర్యాన్ని ఇచ్చిందని వారన్నారు. ఇటీవల మండలంలో మరణించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరుల కుటుంబాలను ఆమె వ్యక్తిగతంగా కలిసి పరామర్శించారు. బిడిమి గ్రామం నుండి తన పర్యటన



ప్రారంభించి, అక్కడి నుండి పెద్దకేసుపురం, చిన్నకేసుపురం, సొండిపూడి, మరియు కుల్లోగం గ్రామాలకు వెళ్లి, ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరించారు. చిన్న కేశవపురం గ్రామంలో మడియా దుర్యోధన, బిడిమి గ్రామంలో తామాడ అప్పలమ్మ, సొండిపూడి గ్రామంలో కోనారి వల్లమ్మ, ఇల్ల జోగారావు ఇటీవల మరణించగా వారి చిత్రపటాలకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. కేవలం పరామర్శకే పరిమితం కాకుండా, వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకుని, వారికి పార్టీ, వ్యక్తిగతంగా అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఎల్ఏ శిరీషాతో పాటు కూటమి నాయకులు కూడా పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుపై

# అంబటి అనుచిత వ్యాఖ్యలు హేయం

*** బేషరతుగా క్షమాపణ చెప్పాలి * ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్**

**ఆమదాలవలస, ఫిబ్రవరి 1(వార్త):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ తీవ్రంగా ఖండించారు. అంబటి రాంబాబు తీరుపై ఘాటు విమర్శలు గుప్పించారు. రాజకీయాల్లో విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలని, వ్యక్తిగత దూషణలు చేయడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జోలికొస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ, అంబటి చేసిన వ్యాఖ్యలు అత్యంత నీచమైనవని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో నోరు పారేసుకున్న కారణంగానే ప్రజలు వైసీపీని 11 సీట్లకే పరిమితం చేశారని, ఘోర పరాజయం ఎదురైనా అంబటి రాంబాబుకు సిగ్గు రావడం లేదని మండిపడ్డారు. వైసీపీ మళ్లీ బూతుల సంస్కృతిని రాజకీయాల్లోకి తెస్తూ రాష్ట్ర రాజకీయాలను కలుషితం చేస్తోందని ఆరోపించారు. గొడవలు, హత్యలకు ప్రయత్నించే ధోరణిని ప్రోత్సహించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. అంబటి రాంబాబు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగంగా బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అంబటిని రాజకీయాల నుంచి బహిష్కరించాలన్నారు.

## అంబటిపై దాడికి ఖండన

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి1 (వార్త):** రాష్ట్రంలో తెలుగుదేశం గూండాలు ప్రతిపక్ష నాయకుల పై దాడులను ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, వైసిపి బి.సి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, వైసిపి క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రత్తి అన్వేష్ సోంపేట జడ్.పి.టి.సి ప్రతినిధి పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, కవిటి మండలం గొర్లెపాడు సర్పంచ్ ప్రతినిధి కరగాన వల్లభరావులు ఖండించారు. మాజీ మంత్రి అంబటి తో సహా పలువురు వైస్సార్సీపీ నాయకులు పై జరుగుతున్న దాడులు అరికట్టాలని కోరారు. అంబటి రాంబాబు పై దాడి ని తెలగ కాపు బలిజ ఒంటరి సంక్షేమ సంఘం నాయకులు కట్టా సూర్యప్రకాశ రావు ఒక ప్రకటనలో ఖండించారు.





## వెచ్చా జయంతి మెమోరియల్ క్రికెట్ పోటీలు

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి1 (వార్త):** సురంగి రాజా మైదానంలో వెచ్చా జయంతి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు జరుగుతున్నాయి. విశాఖపట్నం ఆర్‌కె అకాడమీ, సోంపేట జట్లు మధ్య పోటీలు జరిగాయి. సోంపేట 103 పరుగులకి అల్ ఔట్ అయ్యింది. విశాఖపట్నం జట్టు 10 ఓవర్‌లలో 2 వికెట్లు కోల్పోయి 105 పరుగులతో విజేతగా నిలిచింది. డేవిడ్ 54 పరుగులతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కైవసం చేసుకున్నారు. మధ్యాహ్నం బెర్హంపూర్ జె సి సి స్పోర్ట్స్ లీడ్స్ జట్ల మధ్య పోటీ జరుగగా లీడ్స్ విజేత గా నిలిచింది. విజేతలకు వెచ్చా కేశవరావు, కాళ్ళ దిలీప్ కృష్ణయ్యలు బహుమతులు అందజేశారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 1(వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నేరుగా లేదా ఆన్లైన్‌లో మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చునన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

## టెక్కలిలో రెవిన్యూ క్లినిక్..

జిల్లాలోని రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేస్తూ టెక్కలి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జిల్లా మొత్తానికి సోమవారం ప్రత్యేక 'రెవెన్యూ క్లినిక్' నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వయంగా పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నారు. భూ సమస్యలు, మ్యుటేషన్లు, పట్టాదారు పాసు పుస్తకాలు, భూ సర్వే వంటి దీర్ఘకాలిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు ఈ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## 12న జరగబోయే సమ్మెను జయప్రదం చేయాలి



**మందస, ఫిబ్రవరి 1(వార్త):** కార్మిక, కర్షక ఐక్యతతో ఈనెల 12న జరగబోయే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయు నాయకులు పిలుపునిచ్చారు. మందస మండలంలోని హరిపురం గ్రామంలోని సోమేశ్వర కార్మిక సంఘ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి కె.కేశవరావు, సీఐటీయు మండల గౌరవ అధ్యక్షుడు మట్ట ఖగేశ్వరరావులు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సోమేశ్వర సంఘ అధ్యక్షుడు ఎన్.షణ్ముఖరావు, సంఘ నాయకులు టేకి వాసు పాల్గొన్నారు.

## గొట్టిపల్లి దుర్గమ్మ ఆలయంలో చోరీ



**నరసన్నపేట, ఫిబ్రవరి 1(వార్త):** నరసన్నపేట మండలం గొట్టిపల్లి గ్రామంలో ఉన్న దుర్గమ్మ ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి వెంటనే గ్రామస్థులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై టీడీపీ నాయకుడు కుమార్‌తో పాటు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న నరసన్నపేట ఎస్సై శేఖర్ రావు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆలయాన్ని పరిశీలించారు. ఆలయంలోని హుండీ నగదుతో పాటు సుమారు 5 శతమానాల బంగారం దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## నవ్యాంధ్ర నిర్మాణానికి..

# కేంద్ర బడ్జెట్ దోహదం

### ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం, ఫిబ్రవరి1 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. విభజన హామీల అమలుతో పాటు, మౌలిక వసతుల కల్పనకు కేంద్రం కట్టుబడి ఉందని ఈ బడ్జెట్ నిరూపించిందని ఆయన అన్నారు. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి మరియు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చని ఈ బడ్జెట్ రుజువు చేసిందన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిధులు కేటాయించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## వత్సవలసలో రాజమ్మ సంబరాలు ప్రారంభం

**గార/శ్రీకాకుళం, ఫిబ్రవరి1(వార్త):** వత్సవలసలో రాజమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి. శనివారం సాయంత్రం నుంచే భక్తులు వత్సవలసకు బారులు తీరారు. ఆదివారం ఉదయం సముద్ర స్నానాలు ఆచరించి భూలోకమ్మ, రాజమ్మలను దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో వత్సవలస వెళ్లే రహదారులు కిక్కిరిశాయి. ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐలు బి.ప్రసాదరావు, పైడిపు నాయుడు, గార ఎస్ఐ గంగరాజు, ఏఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## వైభవం.. వేణుగోపాలుని కల్యాణం

**గార/శ్రీకాకుళం, ఫిబ్రవరి1(వార్త):** శ్వేతగిరిపై వెలిసిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం అర్చకులు వేణుగోపాలచార్యులు, సాయిశర్మ పలువురు రుత్వికులు వేద మంత్రాల మధ్య కల్యాణం నిర్వహించారు. ట్రస్టుబోర్డు చైర్మన్ సుగ్గు మధురెడ్డి దంపతులు, ట్రస్టుబోర్డు సభ్యులు గుండ భాస్కరరావు, కె.ఆదినారాయణ, బోర వెంకటరావు, బోర వాసుదేవరా వుతోపాటు ఇతర పాలకమండలి సభ్యులు పాల్గొని భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

## రాజా డిజిటల్ షాపి లక్కీడ్రా

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 1 (వార్త):** దసరా దీపావళి సంక్రాంతి పురస్కరించుకుని చేపట్టిన లక్కీ కూపన్ల సభ్యులకు డ్రా నిర్వహించారు. మెయిన్ రోడ్డు లో గల రాజా డిజిటల్ షాపి లక్కీ డ్రాను టౌన్ ఎస్ఐ ఎం.ముకుంద రావు తీశా రు. మొదటి బహుమతి దక్కత సోమేస్ బెల్లు పడా రెండో బహు మతి ఏ యాదవ రావు ఈదు పురం, మూడో బహుమతి వై ఢిల్లీశ్వరి గోపాల పురం గెలుపొందారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546